క్లుప్తంగా

మంచినీటి బోరు పనులు ప్రారంభం


దేవులపల్లిలో బోరు పనులు ప్రారంభించిన జెడ్పీటీసీ బాబ్జి

జంగారెడ్డిగూడెం రూరల్: తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని దేవులపల్లిలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మంచినీటి బోరు ఏర్పాటు పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ బోరు నిర్మాణ పనులు పూర్తి చేసి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ ప్రగడ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, నాయకులు ప్రగడ సోం ప్రకాష్, బుడేకుల పాపారావు, కేతినేని బాబు, కట్టూరి జాన్‌రాజ్, పెదపూడి కేశవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కొయ్యలగూడెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.అశోక్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

శ్రీనివాసపురంలో గ్యాస్ కనెక్షన్ల పంపిణీ


శ్రీనివాసపురంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో ఆదివారం 12 మందికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావుల చేతుల మీదుగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి రాజా, పత్తిపాటి రాజారావు, పోల్నాటి నాని, పోల్నాటి రాజు, పాడుదోలు రామయ్య పాల్గొన్నారు.

విశేషాలంకరణలో వాసవీమాత


ద్వారకాతిరుమల క్షేత్రంలో గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న వాసవీమాత

ద్వారకాతిరుమల: క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఈ ప్రత్యేక అలంకరణలో దర్శన భాగ్యాన్ని కల్పించారు. ముందుగా ఆలయంలో కొలువైన అమ్మవారికి పురోహితులు గాజులతో అలంకారణ జరిపి, కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

శ్రీవారి క్షేత్రంలో గజ్జె పూజ


శ్రీహరి కళాతోరణ వేదికపై నాట్యప్రదర్శన చేసిన బాలికలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో పలువురు బాలికలు ఆదివారం గజ్జెపూజ నిర్వహించారు. భరతనాట్యం నేర్చుకున్న తరువాత తొలిసారిగా గజ్జ కట్టి స్వామివారి సన్నిధిలోని శ్రీహరి కళాతోరణ వేదికపై బాలికలంతా కలసి నాట్య ప్రదర్శన జరిపారు. సంప్రదాయ దుస్తుల్లో బాలికలు చేసిన నాట్య ప్రదర్శనలు చూపరులను అలరించాయి. నాట్యం చేసిన వారిలో ద్వారకాతిరుమల, దొరసానిపాడు గ్రామాలకు చెందిన బాలికలున్నారు.

ప్రగతి పథంలో గిరిపల్లెలు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధిక నిధుల కేటాయింపు
- సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున మంజూరు
- ప్రతి గ్రామంలో సింహభాగం పూర్తయిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిపుత్రులు


అచ్చియ్యపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ఐటీడీఏ పీఓ సూర్యతేజ(ఫైల్)


దొరమామిడిలో నిర్మించిన డ్రెయినేజీ

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల పాలనాకాలంలో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందుకోసం సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందజేయడంతోపాటు వాటి అమలు తీరు తెలుసుకునేందుకు ప్రతి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నేతలను పేదల ఇంటికి పంపి వారి సమస్యలు తెలుసుకున్నారు. దీని ద్వారా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా ప్రతి సచివాలయానికి గడపగడపకు మన ప్రభుత్వం నిధుల పేరిట రూ.20 లక్షల చొప్పున కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేశారు. అయితే గిరిపల్లెల్లో అధికంగా సమస్యలు ఉన్నాయని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రత్యేకంగా పోలవరం నియోజకవర్గానికి ప్రతి సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున నిధులను కేటాయించి గిరిపుత్రులపై ఆదరణ చూపారు. దీంతో ఈ నిధులతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ శరవేగంగా జరిగాయి. ఇందులో సింహభాగం ఇప్పటికే పూర్తికాగా కొన్నింటిని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు.

రూ.42 కోట్ల 80 లక్షలతో అభివృద్ధి పనులు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, టి.నర్సాపురం, కొయ్యలగూడెం మండలాల్లోని గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.40 లక్షల నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. ఇప్పటికే పూర్తయిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. సుమారు రూ. 42 కోట్ల 80 లక్షల వ్యయంతో గ్రామంలోని గుర్తించిన వాటిలో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులను పూర్తి చేయడం జరిగింది. గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పోలవరం అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి దోహదం



ప్రతి సచివాలయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.40 లక్షలు కేటాయించడంతో గిరిజన ప్రాంతంలో గ్రామాల అభివృద్ధికి ఈ నిధులు దోహదపడ్డాయి. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా కేటాయించిన నిధులతో నియోజకవర్గంలో డ్రెయినేజీలు, రహదారి పనులు పూర్తి చేయడం జరిగింది. కొన్నిచోట్ల పనులు పూర్తికావొచ్చాయి. గడపగడపకు నిధులతో అత్యధికంగా రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చాం.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన రూ.40 లక్షల నిధులతో దొరమామిడి సచివాలయ పరిధిలోని 15 గ్రామాల్లో సీసీ రోడ్లు, 4 గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మించాం. ఆ పనులు పూర్తికాగానే వాటిని ప్రారంభించాం. గిరిజన గ్రామాలకు అధిక నిధులు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు.

– తెల్లం రాముడు, సర్పంచ్, దొరమామిడి

త్రిశక్తి పీఠంలో వాసవీమాతకు పూజలు

కొయ్యలగూడెం: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం కన్నాపురం రోడ్డులోని త్రిశక్తి పీఠంలో నిర్వహించారు. మాఘ శుద్ధ విదియ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ పరిరక్షణ ట్రస్టుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, మహాన్యాసము, మండపారాధన నిర్వహించి అమ్మవారికి విశేష పుష్పమాలంకరణ చేశారు. మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం సాయంత్రం నుంచి కనుల పండువగా జరిపారు.

ఘంటసాల వర్ధంతి


ఘంటసాల వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. పట్టణ ప్రముఖులు, ఘంటసాల అభిమాని మల్లాది సీతారామారావు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ స్థానిక ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మధుర గాయకుడు ఘంటసాల ఆయన పాటలద్వారా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీధర్, తాతాజీ, తిప్పాబొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి


కొయ్యలగూడెంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కొయ్యలగూడెం: ఈనెల 16న దేశవ్యాప్త సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు నిర్వహిస్తున్న గ్రామీణ భారత్ బంద్ పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని వామపక్షాల పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఈ మేరకు పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం మెయిన్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారనీ, కానీ ఇది అమలు కాలేదన్నారు. దీంతో నిరుద్యోగం గత 50 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరిందన్నారు. నరేంద్ర మోడీ విధానాల వల్ల 2019–2022 మధ్యకాలంలో ఒక శాతం ఉన్న బడా కార్పొరేట్ల వాస్తవ ఆదాయం 30% వృద్ధి చెందగా, పేదల వాస్తవ ఆదాయం 11 శాతానికి పడిపోయిందన్నారు. కార్పొరేట్ విధానాలను నిరసిస్తూ సమ్మెకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, రైతు సంఘం జిల్లా నాయకులు జమ్మి శ్రీనివాస్, రైతు కూలీ సంఘం నాయకులు సద్గురుడు, రైతుకూలీ సంఘం నాయకులు మడకం రామన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులలు, గుదే శ్రీను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జనాజగ్గారావు ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం: ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఇఫ్టూ జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మె ప్రచారంలో భాగంగా ఆదివారం మసీద్ సెంటర్లో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న లేబర్ చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చారని, 12 గంటల పని విధానాన్ని పార్లమెంట్లో ఆమోదించుకున్నారని ఇది కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేయడమేనని అవి ఉపసంహరించే వరకు కార్మికులు ఐక్యంగా పోరాడతారన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మ సోమలింగ మల్లికార్జునరావు, కే నాగమోహనరావు, దిర్శిపాము చంద్రయ్య, కొత్తూరు నల్ల వెంకటేశ్వరరావు, మత్రి సుబ్బారావు, కొత్తూరు నాగయ్య, ముప్పిడి రామకృష్ణ, బి.గోతీయ, చిలక ఇమాన్యుల్ పాల్గొన్నారు.

పంగిడిగూడెం గ్రామాభివృద్ధిపై చర్చించిన మంత్రి వనిత


మంత్రి వనితకు పూల బొకేను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు యోహాను, రాజబాబు తదితరులు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో గ్రామాభివృద్ధిపై గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, హోంమంత్రి తానేటి వనిత స్థానిక నాయకులతో చర్చించారు. గ్రామానికి వచ్చిన మంత్రికి గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రత్తిపాటి మహలక్ష్ముడు (యోహాను) తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన చర్చా కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి శ్రీను, నేతలు బోరుగడ్డ రాజారావు, జంగా వెంకట కృష్ణారెడ్డి, కిలారపు రుక్మిణినాద్, కుంటం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులకు స్థానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన నాయకులకు స్థానం లభించింది. ఈ మేరకు ఆదివారం విజయవాడ చాంద్ కళ్యాణ మండపంలో నిర్వహించిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశం వివరాలను ఆ సంఘ ఏలూరు జిల్లా నాయకులు పత్రికలకు విడుదల చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరిగిందని, ఈ కమిటీలో జిల్లాకు చెందిన బీఏ సాల్మన్ రాజు రాష్ట్ర కార్యదర్శిగా మరోసారి ఎన్నిక కాగా ఎస్‌కే రంగావలి రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారని తెలిపారు. రాష్ట్ర కమిటీకి ఎన్నికైన జిల్లా నాయకులకు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మరింత కృషి చేయాలని కోరారు.

దేవుని పట్ల భక్తి, విశ్వాసాలతో జీవించాలి


అమలోద్భవి మాత చర్చిలో దివ్య బలిపూజ నిర్వహిస్తున్న బిషప్ పొలిమేర జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజలు దేవునిపట్ల నిజమైన భక్తి, విశ్వాసాలతో జీవించాలని, అప్పుడే వారు దేవుని నుంచి స్వస్థత, కుటుంబ సమస్యల్లో పరిష్కారం పొందుతారని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సూచించారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి మాత చర్చి వార్షికోత్సవం ఆ చర్చి విచారణ గురువు ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మేరీమాత స్వరూపంతో స్థానిక సెయింట్ ఆన్స్ కాన్వెంట్ నుంచి కెథీడ్రల్ చర్చి వరకూ భారీ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి కథీడ్రల్ ఆవరణలో బిషప్ జయరావు దివ్య బలిపూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ జయరావును చర్చి విచారణ గురువు ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో ఫాదర్ ఏ. రాకేష్, డీ. అబ్రహం, ఎస్.విజయథామస్ ఘనంగా సన్మానించారు. అనంతరం బాలలకు మొదటి దివ్య ప్రసాదం, భద్రమైన అభ్యంగన సాంగ్యాలు ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫాదర్ పీ. బాల, ఫాదర్ జీ. మోజెస్, ఫాదర్ టీ. ఇమ్మానియేలు, ఫాదర్ డీ. ఆరోను, ఫాదర్ బీ. రాజు, కార్పొరేటర్ ఎం. నిర్మల జేవియర్, ఏఎంసీ డైరెక్టర్ జీ. బెనర్జీ, ఐ. రత్నరాజు, పలువురు ఫాదర్లు, సిస్టర్లు, వేలాది మంది విశ్వాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


భీమడోలు: విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి ఆదివారం ఉదయం మృతి చెందాడు. గుండుగొలనుకి చెందిన కూలీ సలాది కొండయ్య (47) మృతి చెందాడు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుండుగొలనుకి చెందిన సలాది కొండయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన కొండయ్య గత నెల 19న మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవ పడ్డాడు. దీనితో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీనితో కొండయ్య ఇంటిలోని కలుపు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడ్ని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సహాయం అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొండయ్య ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో పాటు మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

వైభవంగా వాసవీ మాత ఆరాధనోత్సవాలు


లక్ష పసుపుకొమ్ములతో వాసవీ మాతకు సహస్ర నామావళి పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు


ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం వాసవీ మాత ఆరాధనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నగరానికి చెందిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆరాధనోత్సవ కమిటీ, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత ఆరాధనోత్సవాలు జరిపారు. స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు 102 మంది సువాసినీలచే లక్ష పసుపుకొమ్ములతో అమ్మవారికి సహస్రనామావళి పూజ, అనంతరం విశేష కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం వాసవీమాత మూలమంత్ర హోమం, 102 మంది రుషి గోత్ర హోమం, షోడశోపచార పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి తీర్థప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు చిన్నం రామసత్యనారాయణ, గాదంశెట్టి శ్రీనివాసరావు, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు దివ్వెల జయబాబు, వేమా సురేష్, మద్దుల రవికుమార్, బచ్చు విష్ణు, మానేపల్లి రామారావు, కూరాళ్ళ రమాదేవి పాల్గొన్నారు.

నగరంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాఘమాసంలోని మాఘ పూర్ణిమ, శివరాత్రి పండుగల ప్రత్యేకతపై త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం స్థానిక పోణంగి రోడ్డులోని చిరంజీవి బస్టాప్ ప్రాంతంలో ఆదివారం ఇంటింటా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ప్రతినిధులు మాట్లాడుతూ మాఘమాసం శుక్ల చతుర్థశి నాడు శివరాత్రిగా నిర్ణయించారని, పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి అవసరం లేని నిరాకార పరమాత్మను ఈశ్వర లింగంగా చూపించారన్నారు. అలాగే మాఘ పూర్ణిమ భగవంతుని జన్మను తెలియజేస్తుందని, సాకార భగవంతుడికి గర్భగుడి ఉటుందని వివరించారు. దేవాలయాలు సగుణోపాసన, నిర్గుణోపాసన వ్యత్యాసాలను తెలియజేస్తున్నాయని ఈ మేరకు మాఘమాసంలో సగుణ, నిర్గుణ పూజల విశేషత తెలుసుకోవడం వల్ల ధర్మాలేవో, అధర్మాలేవో తెలుసుకోగలిగే విచక్షణకు అవకాశం ఉంటుందన్నారు. త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి– హిందూ జ్ఞాన వేదిక తాడేపల్లిగూడెం కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, ఎం.కోటేశ్వరరావు, సీహెచ్ అశోక్ పాల్గొన్నారు.

దుష్టశక్తులను తరిమికొట్టాలి


డాక్టర్ ఎండీ కామిలు జమా, ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్

ఏలూరు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దుష్టశక్తులను ప్రజలంతా ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ డాక్టర్ ఎండీ కామిలు జమా అన్నారు. ఏలూరులో ఆయన ఆదివారం మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని నాశనం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు. టీడీపీ బలహీనంగా ఉండడంతోనే గెలుపుపై భయంతో పొత్తుల కోసం చంద్రబాబు వెంపర్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఒకవైపు ప్యాకేజీ స్టార్‌తో పొత్తుల కోసం అర్రులుచాచిందనీ, మరోవైపు బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు చంద్రబాబు తెరవెనుక ప్రయత్నాలు చేయటం అతనిలోని ఓటమి భయాన్ని చూపిస్తోందన్నారు. గతంలో బీజేపీ నేతలను ఇష్టారాజ్యంగా తిడుతూ, కాంగ్రెస్‌తో చెలిమి చేశారని, ఇప్పుడు మళ్లీ చేతికి హ్యాండిచ్చి, బీజేపీ పంచన చేరేందుకు కాళ్లు పట్టుకునే స్థాయికి దిగజారటం సిగ్గుచేటన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు రాసిచ్చే స్క్రిప్ట్‌నే మొన్నటి వరకూ పవన్ కళ్యాణ్ చదివితే ఇప్పుడు ఆ వంతు షర్మిల తీసుకున్నారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దత్తున నిధులు కేటాయించటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేసి అఖండ విజయాన్ని అందించాలని కోరారు.

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమానికి కృషి


జిల్లా గొర్రెల పెంపకందార్ల సహకార యూనియన్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

ఏలూరు (టూటౌన్): గొర్రెలు, మేకల పెంపకందార్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వెనుక గల జిల్లా పశువైద్యశాల ప్రాంగణంలో నిర్మించిన జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ భవనాన్ని ఆదివారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమానికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో గొర్రెలను అందిస్తుందన్నారు. గొర్రెలు, మేకల ఆరోగ్య సంరక్షణ, అభివృద్ధికి రాష్ట్రంలో నాలుగు ప్రదేశాలలో రూ.4 కోట్ల సంరక్షణ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి సహకార ఫెడరేషన్ చైర్మన్ జి.ప్రకాష్ యాదవ్, పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏలూరు వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, టీటీడీ బోర్డు సభ్యులు నెరుసు నాగసత్యం, పలువురు యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

ఉంగుటూరు : కైకరంలో సమస్యాత్మక పోలింగు కేంద్రాలను ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, ప్రహరీ తదితర మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. ఎస్సై మణికుమార్‌కు ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొన్ని సూచనలు చేశారు. రౌడీషీటర్లను ముందుగానే గుర్తించాలని, ఎన్నికలలో గలాటాలు సృష్టించేవారిని, గొడవలు ప్రేరేపించే వారిని ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు ఎస్సై మణికుమార్‌కు తెలియజేశారు. గ్రామంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు

పెదవేగి : రాట్నాలమ్మతల్లి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వేంచేసిన రాట్నాలమ్మ తల్లిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు పూజల్లో పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.